క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాల పరిశీలన



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీటీలు

దహెగాం: మండల కేంద్రంతోపాటు ఒడ్డుగూడ, లగ్గాం గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు శ్యాంలాల్, రాజ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వర్షాలకు వరి ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలన్నారు. వారి వెంట రైతులు ఉన్నారు.

బైక్ మెకానిక్ కోర్సులో ఉచిత శిక్షణ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఆటో మొబైల్ రంగంలో ఉద్యోగావకాశాలకు ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్(స్వచ్ఛంద సంస్థ) ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు బైక్ మెకానిక్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కో ఆర్డినేటర్ స్రవంతి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్ 90634 84855 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కొనసాగిన విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న భక్తులు

దహెగాం: పోచమాంబ శీతలాదేవి, నవగ్రహ సహిత సంతాన నాగేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా మంగళవారం రెండో రోజు పూజా కార్యక్రమాలు కొనసాగాయి. వేదపండితులు దుద్దుళ్ల మనోహర అవదాని, పార్థివ శర్మల ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

గ్రామదేవతల ఊరేగింపు

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి గ్రామంలో మంగళవారం గ్రామదేవతల ఊరేగింపు నిర్వహించారు. వర్షాకాలం ఆరంభంలో మిరుగుకు ముందు దేవతలను పూజించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా గంగాస్నానం ఆచరించి, లక్ష్మి దేవాలయం వద్ద బోనాలు నిర్వహించారు. గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు ఆరోగ్యంతో ఉండాలని వేడుకున్నారు. ఆలయ పూజారి నాయిని భీమయ్య, గ్రామ పెద్దలు లక్ష్మీనారాయణ, నాయిని తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు అన్నదానం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని శ్రీ హరిహర అయ్యప్పస్వామి ఆలయంలో చివరిమాస చివరి బుధవారం సందర్భంగా మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. అర్చకుడు నాగేష్ ఆధ్వర్యంలో స్వామివారికి నిత్యపూజ, అభిషేకం, మంగళహారతి, మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్
కుమురంభీం : బిచ్చగాడు-2
కాగజ్‌నగర్
వెంకటరమణ : బిచ్చగాడు-2

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	80
దోసకాయ	40
చామగడ్డ	80
వంకాయ	20
బీరకాయ	60
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సోరకాయ	60
గోబి(పూల్)	40
క్యాబేజ	40

-ఆసిఫాబాద్‌అర్బన్

భూ పరీక్షల జాడేది ?

- జిల్లాలో అటకెక్కిన భూసార పరీక్షలు
- తీవ్రంగా వేధిస్తున్న కిట్ల కొరత
- మట్టి స్వభావంపై అవగాహన కరువు

భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించి రైతులు లాభం పొందవచ్చు. అయితే జిల్లాలో భూసార పరీక్షలు జరగడం లేదు. రసాయనాలు అందుబాటులో లేకపోవడమే ఇందుకు కారణం.



కౌటాలలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

కౌటాల(సిర్పూర్): రైతుల భూముల్లో ఏయే పంటలు సాగు చేయాలి. ఎరువులను ఎంత మోతాదులో వినియోగించాలనే వివరాలు భూసార పరీక్ష ద్వారా తెలుస్తాయి. అలాంటి పరీక్షలు జిల్లాలో అటకెక్కి జాడ లేకుండా పోయింది. మూడేళ్లుగా ఈ పరీక్షలు నిలిచిపోయాయి. కిట్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. మట్టి స్వభావంపై అవగాహన కరువైంది. ఏ పంట వేయాలో అధికారులు చెప్పకపోవడంతో రైతులు ఇష్టారీతిన పంటలు వేసి నష్టపోతున్నారు.

జిల్లాలో 70 క్లస్టర్లు..

మూసపద్ధతి సాగుకు స్వస్తి చెప్పి అధునాతన వ్యవసాయం వైపు రైతులను మళ్లించి.. లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించింది. 5 వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా లెక్కించి జిల్లాలో క్లస్టర్లు ఏర్పాటు చేసింది. 2018లో రైతులకు సేవలందించేందుకు ఒక్కో క్లస్టర్‌కు ఏఈవోను నియమించింది. మొత్తం 70 క్లస్టర్లు ఉండగా..దాదాపు అన్నింటిలో మినీ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో కిట్ సుమారు రూ.1.3 లక్షల వరకు వెచ్చించినా ఫలితం లేకుండా పోతోంది. నేల స్వభావం పరీక్షించేందుకు కెమికెల్స్, జల్లెడ, ఇతర పరికరాలు అందజేశారు. ప్రారంభంలో ఏఈవోలు ఐదేళ్ల క్రితం వారి పరిధిలో భూసార పరీక్షలు నిర్వహించారు. తర్వాత ఇతర పరికరాలు ఇవ్వలేదు. భూసార పరీక్షల కిట్లు మూలనపడి ఉన్నాయి. రసాయనాల సరఫరా లేక మట్టి నమూనా పరీక్షలు జరగడం లేదు.

సమీపిస్తున్న ఖరీఫ్

మట్టి నమూనా పరీక్షల మినీ ల్యాబ్‌లు అలంకారప్రాయంగా మారాయి. వానాకాలం సీజన్ సమీపిస్తున్నప్పటికీ మట్టి నమూనాలు సేకరించే ప్రక్రియ జిల్లాలో ఇంకా ప్రారంభమే కాలేదు. దీంతో భూసారంపై రైతులకు అవగాహన లేక మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకంతో భూమి నిస్సారంగా మారి ఏటా దిగుబడులు తగ్గుతున్నాయి.

పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక..

భాలేపల్లి, పార్డీ గ్రామాలను మూడేళ్ల క్రితం పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైంది. గ్రామాల్లో అధికారులు సేకరించిన మట్టి నమూనాలను ఆదిలాబాద్‌కు పంపించి ఫలితాలను రైతులకు వెల్లడించేవారు. భూమిలో అర గజం లోతులో మట్టిని తీసి వ్యవసాయాధికారికి అందిస్తే భూసార పరీక్ష కేంద్రానికి పంపిస్తారు. పరీక్షతో ఆ భూమిలో 16 రకాల పోషకాలు ఎంతవరకు ఉన్నాయో తెలుస్తోంది. గతకొన్ని రోజులుగా తాటిపల్లి, సాండ్‌గాం, వీరవెల్లి గ్రామాల్లో పలు ఏజెన్సీలు భూ పరీక్షలు చేస్తున్నాయి.

ఒకసారి పరీక్ష చేస్తే..

గత ఖరీఫ్‌లో పత్తి, వరి, మొక్కజొన్న, సోయా పంట దిగుబడి తగ్గింది. ఏ పంట వేయాలో ఎంత మోతాదులో ఎరువు వేయాలో తెలియక జిల్లాలోని రైతులు తికమకపడ్డారు. ప్రభుత్వం స్పందించి ఏటా భూసార పరీక్షల నిర్వహణ సక్రమంగా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అయితే అన్ని రైతు వేదికల్లో భూసార పరీక్ష కిట్లు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఒకసారి భూమిలో భూ పరీక్ష నిర్వహిస్తే మూడేళ్ల పాటు పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం లేదని పేర్కొంటున్నారు.

జిల్లా వివరాలు

మండలాలు	15
క్లస్టర్లు	70
మినీ ల్యాబ్‌లు	70
రైతులు	1.20 లక్ష మంది
సాగు భూమి	4.50 లక్షల ఎకరాలు

పంటరకం	విస్తీర్ణం (ఎకరాల్లో)
పత్తి	3.40 లక్షలు
వరి	58 వేలు
కంది	34 వేలు
సోయా	15 వేలు
జొన్న	వెయ్యి ఎకరాలు
ఇతర	2 వేల ఎకరాలు

అవగాహన కల్పిస్తున్నాం



పంట చేలలో ఎరువుల వినియోగం, పంటల సాగుపై రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నాం. గత మూడేళ్లుగా భూసార పరీక్షలు చేయడం లేదు. ఆసక్తిఉన్న వారు సమాచారం అందిస్తే మట్టి నమూనాలు సేకరించి ఆదిలాబాద్‌కు పంపిస్తాం. అన్ని రైతు వేదికల్లో భూసార పరీక్షలు చేసేందుకు కిట్లు అందుబాటులో ఉన్నాయి.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి

శిక్షణతోనే ఉద్యోగ సాధన సులువు



స్టడీమెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: శిక్షణతోనే ఉద్యోగ సాధన సులభతరం అవుతుందని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. పట్టణంలోని సాయితేజ కళాశాలలో మంగళవారం శిక్షణా తరగతుల ముగింపు, స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దశలవారీగా ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. యువతీ, యువకులు క్రమశిక్షణతో చదువుకుని లక్ష్యాన్ని చేధించాలన్నారు. తనవంతుగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

బెజ్జూర్: కొత్తగా పట్టా పాస్ పుస్తకాలు పొందిన రైతులు వానాకాలం సీజన్ రైతుబంధు పెట్టుబడి సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో రాజులనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కోసం సంబంధిత మండల విస్తరణ అధికారుల వద్ద దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ ఇంకా నిర్ణయించలేదని, ఆలస్యం చేయకుండా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారంతోపాటు పట్టాపాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా పాస్‌పుస్తకం జిరాక్స్ కాపీతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి



రైతులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సంతోష్

రెబ్బెన: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ అన్నారు. నక్కలగూడలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్ణయించి తేమ శాతం ఉన్నప్పటికీ అధికారులు ధాన్యాన్ని తీసుకోవడం లేదన్నారు. లారీలు అందుబాటులో లేక రోజుల తరబడి కేంద్రాల్లో ధాన్యం ఉంచాల్సి వస్తోందని రైతులు వాపోయారు. స్పందించిన జెడ్పీటీసీ వెంటనే డీఎస్‌వో తారామణితో మాట్లాడి రైతుల సమస్యలను వివరించి రెండు లారీలను ఏర్పాటు చేసేలా కృషి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అందుబాటులో గోనె సంచులు, లారీలు ఉండేలా చూడాలన్నారు. నిర్ణీత తేమశాతం ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు.

పద్మశాలీలు సంఘటితం కావాలి



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్: పద్మశాలీలు సంఘటితంగా ముందుకు సాగాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు మచ్చ ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలో పద్మశాలి సంక్షేమ సంఘం సభ్యత్వ నమోదు పుస్తకాలను మంగళవారం స్థానిక నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలన్నారు. జిల్లాలో అత్యధికంగా సభ్యత్వనమోదు చేపట్టి రాష్ట్రంలోనే ముందుండాలన్నారు. మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గాదాసు బాబురావు, రాష్ట్ర నాయకులు నల్ల కనకయ్య, ఇరుకుల్ల మంగ, ఇరుకుల్ల ఆంజనేయులు, కోమటిపెల్లి లింగయ్య, వనమాల ధర్మయ్య, జంజిరాల శ్రీనివాస్, రాంపల్లి విజయ, సంజీవ్, చందు, తిరుపతి, సునీత తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలో పద్మశాలి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయనను పద్మశాలీలు సన్మానించారు. సంఘం అధ్యక్షుడు దాసరి వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి కొంగ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఆ సంఘం 53వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాయకుడు అంగల శ్రీనివాస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్ మాట్లాడుతూ సీఐటీయూ కార్మికులను ఐక్యం చేయడంతోపాటు సమస్యల సాధన కోసం పోరాటాలు చేస్తామన్నారు. ఉద్యోగ, కార్మికుల హక్కుల కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై సాగర్

వాంకిడి: యువకులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్సై సాగర్ సూచించారు. మండలంలోని ఖిరిడి గ్రామంలో యువకులకు మంగళవారం వాలీబాల్ కిట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఉద్యోగ కల్పనే లక్ష్యంగా కష్టపడి జీవితంలో స్థిరపడాలన్నారు. వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్, సర్పంచ్ గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న కార్మికులు

చింతలమానెపల్లి(సిర్పూర్): తమకు చెల్లించాల్సిన వేతనాలను అక్రమంగా కాజేస్తున్నారని ఆరోపిస్తూ చింతలమానెపల్లి మండలం డబ్బా పంచాయతీ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబ్బా పంచాయతీలో ఆరు నెలలుగా తమకు వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. పంచాయతీ అధికారులు సూచించిన విధంగా సంతకాలు పెడుతున్నామని, అయితే తమకు తక్కువ వేతనాలు చెల్లించడంపై అనుమానాలు ఉన్నాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వండి



రామారావ్(ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలో దొంగతనాలకు పాల్పడుతున్న టేకం రామారావ్ (తుకారాం) ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని సీఐ రాణాప్రతాప్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరుగుతున్న రామారావ్ కనిపిస్తే సెల్ 87126 70506, 95509 72074, 87125 75500, 98662 67955, 98667 24848 నంబర్లలో తెలిపాలని కోరారు.

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రామారావు

దహెగాం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు అన్నారు. స్థానిక రైతు వేదికలో అధికారులు, సర్పంచులకు దశాబ్ది ఉత్సవాలపై మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 3న రైతు ఉత్సవం, 8న మన ఊరు-మన చెరువు, 15న పల్లె ప్రగతి ఉత్సవం, 19 హరిత ఉత్సవం, 22న అమరవీరుల సంస్మరణ, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్న ట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, ఎస్సై సనత్ కుమార్, డీటీ బక్కయ్య, సర్పంచులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ మల్లికార్జున్

రెబ్బెన: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తహసీల్దార్ మల్లికార్జున్, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై మంగళవారం సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని పంచాయతీల్లో, గ్రామాల్లో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ ఉత్సవాల్లో ప్రజలను భాగస్వాములు చేయాలన్నారు. సమావేశంలో ఎస్సై భూమేష్, ఏవో మంజుల, ఎంపీవో అంజద్‌పాషా, కార్యదర్శులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వాంకిడి: మండలంలోని ఖిరిడి గ్రామంలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రహీముద్దీన్, ఎస్సై డి.సాగర్‌లు గ్రామస్తులకు చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. చట్టాన్ని గౌరవిస్తూ హక్కులతో పోరాడాలని సూచించారు. వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేడుకలు



పాల్గొన్న క్రైస్తవులు

కౌటాల: మండలంలోని యాపలగూడ గ్రామంలో సెయింట్ మేరి కథోలిక చర్చి 52వ వార్షికోత్సవాన్ని మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జి ల్లా బిషప్ ప్రిన్స్ అంటోని క్రైస్తవులకు దేవుని వాక్యం బోధించారు. ఏసు చూపిన మార్గంలో అందరు నడవాలని తెలిపారు. అనంతరం యువతి, యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. చర్చి ఫాదర్ సతీశ్, సభ్యులు లహ న్సు, గణపతి, నెహ్రూ, రాజమల్లు, ప్రవీణ్, నిరంజన్, రవి తదితరులు పాల్గొన్నారు.

హరితహారానికి సిద్ధం

- నర్సరీల్లో మొక్కల పెంపకం
- ఈ ఏడాది 3.01 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



గంభీరావుపేటలోని నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఏపీవో షాకీర్ ఉస్మాని, టీఏ సాగర్(ఫైల్)

తిర్యాణి: రాష్ట్రాన్ని పచ్చలహారంగా మార్చాలని, అడవులను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. మండలంలో 9 విడత హరితహారానికి సర్వం సిద్ధమైంది. 29 గ్రామ పంచాయతీలకు ఒక్కో నర్సరీని ఏర్పాటు చేసింది. వివిధ మొక్కలను పెంచి వనసేవక్‌ను నియమించడంతో వాటిని సంరక్షిస్తున్నారు.

3.01 లక్షల మొక్కల లక్ష్యం..

9వ విడత హరితహారం కోసం మండలానికి 3.01 లక్షల మొక్కల లక్ష్యాన్ని అధికారులు నిర్దేశించారు. ఇందుకుగాను 29 గ్రామ నర్సరీల్లో వివిధ పూలు, అలకరణ, తదితర మొక్కలను పెంచుతున్నారు. వనసేవక్ ద్వారా మొక్కలను సంరక్షిస్తున్నారు. వర్షాకాలంలో ఈ మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని శాఖల అధికారులు చెబుతున్నారు. మామిడి, జామ, నిమ్మ, గులాబీ, నేరెడు, సీతాఫల్, ఉసరి, దానిమ్మ, బాదాం, మందార, మల్లె లాంటి పండ్ల పూల మొక్కలతోపాటు టేకు, గంధం, వెదురు, కానుగ, వేప, రావి, రేగి లాంటి నీడనిచ్చే మొక్కలు అందుబాటులో ఉన్నాయి. గృహ సముదాయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు గ్రామ అంతర్గత రోడ్ల పక్కన, పొలం గట్టు, చెరువులు, కుంటలు, పార్కులు, డంపింగ్‌యార్డులు కాల్వ గట్లపై మొక్కలను నాటనున్నారు. మొక్కల నాటేందుకు ఇప్పటికే అవసరమయ్యే స్థలాలను అధికారులు గుర్తించారు. నాటేందుకు అవసరమైన గుంతల తవ్వకాల పనులు చేపట్టనున్నారు. కాగా, జిల్లాలో మరో 20 రోజుల్లో హరితహారం కార్యక్రమం నిర్వహించే అవకాశాలున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఏర్పాటు పూర్తి చేశాం

9వ విడత హరితహారం కోసం మండల వ్యాప్తంగా 3.01 లక్షల మొక్కలను సిద్ధం చేశాం. గ్రామాల్లో మొక్కలు నాటేందుకు స్థలాల గుర్తింపునకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేశాం. మరో 20 రోజుల్లో హరితహారం చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నాం.

– షాకీర్ ఉస్మాని, ఏపీవో, తిర్యాణి

వ్యర్థాల నిర్వహణపై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు ఉద్యోగులు

రెబ్బెన(ఆసిఫాబాద్): జూన్ 5న నిర్వహించే ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గోలేటిలో వ్యర్థాల నిర్వహణ అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీజీ ఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహరా మాట్లాడుతూ వ్యర్థాలను పునర్ వినియోగించడం మూలంగా పర్యావరణ కాలుష్యం తగ్గుతుందన్నారు. పేపర్ వినియోగం పొదుపుగా చేసుకోవాలన్నారు. వ్యర్థాలను బయో గ్యాస్ తయారీకి వినియోగిస్తే బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. జూనియర్ ఫారెస్టు అధికారి నవీన్‌కుమార్, అసిస్టెంట్ రమ్యకృష్ణ పాల్గొన్నారు.

రోగుల ఇబ్బందులు తీర్చాలి

ఆదిలాబాద్: రిమ్స్‌లో సమస్యలతో రోగులు ఇబ్బంది పడుతున్నారని డీసీసీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. రిమ్స్ ఆస్పత్రిని మంగళవారం సందర్శించి.. రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.